# రైల్వేలో ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్న పాలకులు

ఈ సంవత్సరం రైల్వేశాఖలోని 90వేల ఖాళీ స్థానాలను ఉద్యోగులతో భర్తీ చేయనున్నట్లు రైల్వేశాఖమంత్రి ప్రకటించాడు. చివరిసారిగా రైల్వేశాఖలో 5 సం॥ల క్రితం 2013 సం॥లో ఖాళీలను భర్తీ చేశారు. ఆనాడు ట్రాక్‌మెన్, పారిశుధ్య సిబ్బంది, కార్యాలయ బంట్రోతులు, పోర్టర్లు, రైల్వే గుమాస్తాలు, ట్రాఫిక్ సహాయకుల వంటి 20వేల పోస్టులను భర్తీ చేశారు.

ప్రస్తుతం ప్రకటించిన 90వేల ఉద్యోగాలలో ఎ) అసిస్టెంట్ లోకో పైలెట్లు మరియు సాంకేతిక సిబ్బంది 26,000 బి) గ్రూప్ – డి కార్మికుల ఉద్యోగాలు 63,000, సి) జూనియర్ ఇంజనీర్లు 400 డి) పాయింట్స్‌మెన్ మరియు స్టేషన్‌మాస్టర్లు 410– మంది వున్నారు.

1990లలో భారతీయ రైల్వేశాఖలో మొత్తంగా 25 లక్షలమంది ఉద్యోగులు వుండేవారు. 2000 సం॥ నాటికి ఈ సంఖ్య 15 లక్షల 40 వేలకు పడిపోయింది. కాగా ప్రస్తుం ఆ సంఖ్య 12 లక్షల 50 వేలుగా వుంది. అయినప్పటికీ రైల్వే మంత్రిత్వ శాఖ 2 లక్షల 22వేల 509 పోస్టులనే ఖాళీగా వున్నాయని చూపుతోంది. వీనిలో 1,28,942 ఉద్యోగాలు రైల్వే భద్రతా విభాగానికి చెందిన ముఖ్యమైనవి. ఇప్పుడు భర్తీ చేస్తామని ప్రకటించిన 90వేల ఉద్యోగాలు ఖాళీగా వున్న పోస్టులలో సగం కంటే కూడా చాలా తక్కువ. రైల్వే గార్డులవంటి ముఖ్యమైన భద్రతా విభాగాల్లో ఖాళీల భర్తీ అనేదే జరగడం లేదు.

రైల్వేశాఖ అధికారులు ప్రస్తుతం ప్రకటించిన 90వేల పోస్టులన్నీ కూడా పర్మినెంట్ ఉద్యోగులతో భర్తీ చేయబోవటంలేదని ప్రకటించారు. 'అత్యవసర పోస్టులు'గా గుర్తించినవాటిని మాత్రమే రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయగా, మిగిలిన పోస్టులన్నింటినీ ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

భారత రైల్వేలలో ఐటిఐ, పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన డిప్లొమా కలవారిని సహాయకులుగా తీసుకుంటారు. వారి సహాయ శిక్షణా సమయం పూర్తయిన తర్వాత కూడా వారిని రైల్వేశాఖ ఉద్యోగాలలోకి ఇముడ్చుకోవటంలేదు. రైల్వే శాఖలో ఉద్యోగం పొందాలనుకున్న ఈ వేలాదిమంది సహాయకుల ఆశలన్నీ తుడిచివేయబడుతున్నాయి.

ఇంతేగాక, రైల్వే శాఖ యాజమాన్యం సహాయకులుగా శిక్షణ పొందేవారి అర్హతను ఐటిఐ నుండి పదవ తరగతికి తగ్గించింది. గ్రూప్–సి మరియు గ్రూప్ – డి విభాగాలలో అత్యధిక ఉద్యోగాలకు పదవతరగతి చదువును మించి అవసరం ఉండదని వారు వాదన చేస్తున్నారు. ఎందుకంటే ఈ ఉద్యోగాలలో అత్యధికులు రైల్వే ట్రాక్‌ను, రైలు పెట్టెలను శుభ్రపరచటం, నిర్వహించటం వంటి పనులు చేయవలసిన వారే కనుక పదవతరగతి అర్హతగా సరిపోతుందని రైల్వే యాజమాన్యం చెబుతోంది. పదవ తరగతి అర్హతగా ప్రకటించటంతో ఈ ఉద్యోగాల కోసం పోటీపడేవారి సంఖ్య 50 లక్షల నుండి 6 కోట్ల 30 లక్షలకు చేరుకుంది.

ఇది రెండువైపులా పదునున్న విధానం. ఒకవైపున రైల్వే యాజమాన్యం గ్రూస్–సి మరియు గ్రూప్–డి ఉద్యోగాలను, అలాగే ఇపుడు ప్రకటించిన ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేయటాన్ని కొనసాగించిన ఫలితంగా తక్కువస్థాయి వేతనాలతో సరిపెట్టవచ్చు. పైగా, ఇదే సంఖ్యలో ఎక్కువ వేతనం పొందుతూ సాంకేతిక విద్య నేపథ్యమున్న ఉద్యోగులు 2019 చివరినాటికి ఉద్యోగ విరమణ చేస్తారు కనుక ఎంతో ధనం ఆదా అవుతుందని రైల్వే యాజమాన్యం లెక్కలు వేస్తోంది.

మరోవైపున భారత రైల్వేలలో సాంకేతిక ఉద్యోగాలను యంత్రాలతో భర్తీ చేస్తున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థను 141 శాతం ఆధునీకరించడం ద్వారా, సిగ్నలింగ్ వ్యవస్థలో ఉద్యోగుల ప్రమేయాన్ని రద్దుచేసేందుకనుగుణంగా బడ్జెట్ అంచనాలను పెంచినట్లు రైల్వేమంత్రి పేర్కొన్నారు. భారత రైల్వేలకు చిహ్నాలుగా వుంటున్న ఎరుపు, ఆకుపచ్చ జెండాలు త్వరలో అంతర్థానం కానున్నాయి.

ఢిల్లీ మెట్రోలో ఇప్పటికే డ్రైవర్ల ఉద్యోగాలను యంత్రాలే చేస్తున్నాయి. ప్రస్తుత ఉద్యోగ ప్రకటనలో గార్డుల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ప్రమాదాలను నివారించటంలో, ఒక ప్రమాదానికి లేదా సంఘటనకు కారణాలను నిర్ధారించటంలో గార్డులు నిర్వహించే పాత్ర కీలకంగా వుంటుందని రైల్వే భద్రతావ్యవస్థ చీఫ్ కమీషనర్ నొక్కి చెపుతూ, ఖాళీగా వున్న గార్డుల పోస్టుల్ని భర్తీ చేయాలని సిఫార్సు చేశారు. రైల్వే అధికారులు మాత్రం 'ఎండ్ ఆఫ్ ట్రెన్ టెలిమెట్రీ' (ఇఓటిటి) అనే ఇంజనును చివరి పెట్టెను అనుసంధానించే యంత్రాలను గార్డుల పోస్టుల స్థానంలో ఏర్పాటు చేయటానికే మొగ్గు చూపుతున్నారు.

అత్యధిక ఆధునీకరణ అనివార్యంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడేట్లు చేస్తుంది. దీనికోసం పెద్దమొత్తంలో తప్పనిసరిగా అప్పు చేయవలసి వుంటుంది. దీనితో విదేశీ కంపెనీలపై మనం ఆధారపడటం అనేకరెట్లు పెరిగిపోవటమే గాక, యాంత్రీకరణ ద్వారా ఏ ఆర్థిక ప్రయోజనాలు పొందుతామని ప్రభుత్వం భావిస్తున్నదో, అవన్నీ తుడిచిపెట్టుకుపోతాయి.

ప్రయాణీకులకు మరింత భద్రతతో కూడిన సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించటానికి సింగిల్ రైల్వే లైన్లను డబుల్‌రైల్వే లైన్లుగా మార్చి రైళ్ళను వేగవంతం చేయటానికి బదులుగా కేంద్ర పాలకులు పరిమితమైన వనరులను బులెట్ రైళ్ళు, హైస్పీడ్ రైళ్ళ వంటి వృథా ప్రాజెక్టులపై ఖర్చు చేయటం, సాధారణ ప్రయాణీకుడి అవసరాలను తీర్చటానికి ఏమాత్రం తోడ్పడేదికాదు. కోట్లాది యువకులు ఉద్యోగాల కోసం వేచి వుంటే, ఉద్యోగావకాశాలను అధికంగా కత్తిరించి వేయటమే గాక, ఉద్యోగానికిగానీ, పని ప్రదేశంలో భద్రతగానీ లేని ఉద్యోగాలను ప్రభుత్వం భిక్షగా వేస్తోంది.

oooooo